
మనసులో దాగివున్న వాటికి అక్షరరూపం డైరీ. అలాంటి డైరీలు, పాతవైనాసరే ఎంత పని చేస్తాయో చూడండి.




# డైరీ

రాంగోపాల్

కామరాజు తన కళ్ళను నమ్మలేక పోయాడు.


మిల్లు పనివాళ్ళ సమ్మె గొడవలతో అసలే మనస్సు చికాకుగా వుంది అతనికి. "ఉస్సు" రంటూ సోఫాలో మేను వాల్చాడు ఏవో ఆలోచనలతో, పాతి కేళ్ళపైనాటి తండ్రి "డైరీ" తిరగేస్తున్న వాడు. ఒక్కసారిగా లేచి కూర్చున్నాడు.

ఆ పంక్తులే - ప్రతి మాటా కూడబలు క్కుంటూ, పరకాయించి మళ్ళీ చూశాడు. ఒక చివర దీపారాధన చేసి ఉన్న 'గజలక్ష్మి' వెండిబొమ్మ లగాయితూ, రెండో కొసని, నగ్నసుందరి శిల్పాప్రతిమ వరకూ, హాలులో అటూ ఇటూ పచారుచేస్తూ, ఆ మాటలే మళ్ళీ మళ్ళీ చదివాడు....

గొలుసుకట్టు వ్రాతలో, మొదటిసారిగా తెలియని పొడి అక్షరాలు. "మ.ల." అని స్పష్టం అయింది. "మహాలక్ష్మి" అయి ఉంటుందని అట్టే శ్రమ పడకుండానే నిర్ధారణ చేసుకున్నాడు. అంతకుమించి - ఎన్ని సార్లు చదివినా, అర్థం కొత్తదేమీ స్ఫురించ లేదు. అన్వయం మారలేదు.

గమ్మున సాయంకాలం గదిలో కొచ్చి "మ. ల." మళ్ళీ రభస. ఆ మరందేం పని చెయ్యలేదుట. నాలుగో నెలట. ఏ ఆసుపత్రిలోనో తంటాలు పడమని వంద రూపాయ లివ్వబోతే. ఎంత పొగరు ముండకి? దొంగ ఏడుపేడిస్తే తాను మహా పతివ్రత అనుకుంటారనే కాబోలు. ఏదో వంక దొరికిందని, ఇంకా ఎంత గుంజు కుందామనో. అసలు మెత్తబడితే, నెత్తెక్క తారీరకం. పోనీ లేనిదని దయతలచడం గాని, తెల్లారిలేస్తే ఇల్లాంటివెన్నో ఈ బాపతుకి —"

తండ్రి రంగయ్య ఘనతను గురించి కథలూ గాథలూ అనేకం విన్నాడు కామరాజు. కొన్ని ప్రత్యక్షంగా చూశాడుకూడా. రాజుకి ప్రాజ్ఞత వచ్చాకనే, రంగయ్య మేనేజరుగా వుంటున్న బియ్యపు మిల్లు అంతా తానే కొనేశాడు. ఆ మిల్లుకి వెల్లలూ కొత్త రంగులూ వేయించి, ఇద్దరు రాష్ట్ర మంత్రుల సమక్షంలో ఆనాడు పురమా యించిన మహోత్సవం రాజుకి ఈ నాటికీ ఏదో కలలో విషయంలాగ మెదులుతూనే వుంటుంది. మనస్సులో ఎదురుగుండా తండ్రి కొత్తగా కట్టించిన సిమెంటు చీడీల క్రింద పడవల రేవులో గేదెల నెక్కి ఆడు తున్న పశువుల కుర్రాళ్ళు మిల్లు జవాన్లు తరిమి వెయ్యడం ఒక మంత్రిగారి గోల కంటె ఎక్కువగా, అవతలగా వున్న రైలు స్టేషనులో "గూడ్సుబండి పెద్ద గొడవగా కూతలు పెట్టడం సరిగ్గా వేదిక దగ్గరే ప్రత్యక్షం అయిన ఆడ కుక్కని తరుము కుంటూ జొరబడిన మగకుక్క విదిలించిన ఒండ్రు మన్నుతో సభ గలాభా కావడం - ఈ దృశ్యాలు మాత్రమే రాజుకి బాగా




స్పష్టంగా జ్ఞాపకం వస్తూండేవి.

దానధర్మాలు చేస్తూ, ఒక పెడ సర్కారు పన్నులు తగ్గించుకోడం, రెండో పెడ, పెద్ద పేరూ ప్రాపకం పెంచుకోడం కూడా ఒక్కసారిగానే సాధిస్తూ వచ్చాడు రంగయ్య. శాసనసభలో సభ్యత్వం లగాయితూ, రాష్ట్ర మంత్రిత్వం వరకూ అతని అందుబాటులో ఉన్నా, అంత ఖర్చూ, హైరానులేని తెర వెనకాల రాజకీయాలలోనే అధికారం చెలాయిస్తూ వచ్చాడెప్పుడూను.

ప్రతిభతోబాటు, తండ్రి ఎంత చండశాసనుడో కూడా రాజుకి బాగా అనుభవమే. అతని మాటకు అడ్డు చెప్పినవాడిని అధోగతికి ఈడ్చి త్రొక్కేసేవరకూ తృప్తి పడేవాడుకాదు. ఇంట్లో నౌకర్లకీ, భార్యకీ కూడా అతనంటే సింహస్వప్నంగానే వుండేది. తండ్రితో బాగా చనువుగా మెలిగిన ఘడియ లెక్కువ జ్ఞాపకంలేవు రాజుకి. తండ్రి అంటే రాజుకి ఎప్పుడూ ఓ పెద్ద భయం, కొంత గౌరవం మాత్రమే వుంటూ వుండేవి.

అల్లా అని రంగయ్య తన కుటుంబానికి ఎప్పుడూ లోటు చెయ్యలేదు. ఒక్కడే కొడుకని రాజుని ఎక్కువ గారం చెయ్యకపోయినా, కావలసినవన్నీ సమకూరుస్తూనే వచ్చాడు. ఎల్లాగో రాజుని గ్రాడ్యుయేటని పించాడు. భార్యకికూడా ఏడు వారాల నగలు చేయించాడు. ఆవిడ ఏం కోరినా కాదన లేదు. ఎంతో అనురాగం చూపించేవాడు.

కాని, ఆవిడ చాటున, తండ్రి వేరే చిల్లర తిరుగుళ్ళు తిరిగే వాడని రాజు కలలో కూడా ఊహించలేకపోయాడు ఆ ఘడియ వరకు. అసలంత గంభీరమైన మనిషికి ఇలాంటి గొడవలు వుంటాయని అనుకోడానికైనా ఆస్కారంలేకపోయింది రాజుకి. రంగయ్యని గురించి ఎంత చెడ్డగా మాట్లాడిన వాళ్ళయినా, అతనేదో చండశాసనుడనీ, అత్యాశాపరుడనీ అనడమే తప్ప, అతని శీలాన్ని గురించి ఎక్కడా పొల్లు మాట ఒక్కటయినా పైకి పొక్కలేదు ఇంతవరకూ —

ఇప్పుడైనా ఏదో యధాలాపంగానే ఆ పాత డైరీలో సంగతి రాజు కంటబడింది. అంత నియమంగా తండ్రి డైరీ వ్రాసేవాడని కూడా రాజుకి తెలియదు. హాలుని ఆనుకుని వున్న చిన్న కొట్టుమూల, ఉక్కు బీరువాలో రెండు అరలనిండా, ఆ డైరీ పుస్తకాలు కంట పడటంతో రాజు విస్తుపోయాడు.

రంగయ్య బ్రతికున్నంతకాలం, రెండో మనిషికెవ్వరికీ ఆ గదిలో ప్రవేశం ఉండేది కాదు. తండ్రిపోయి ఆరు నెలలయినా ఈ ఘడియవరకు రాజు కూడా ఆ గది తాళం తియ్యలేదు. తియ్యాల్సిన అవసరమూ రాలేదు. ఆపైన వ్యవహారాలతోటీ, వచ్చేపోయే జనంతోటీ ఆ ఆరుమాసాలు ఏదో కలలా గడిచిపోయి, రాజుకు ఎక్కువ తీరుబడి లేకపోయింది. రాత్రివేళ, ఒక్కసారి కాబోలు, అందులో ఏముందో చూద్దామని గది గుమ్మందాకా వెళ్ళికూడా, ఏదో భయమేసి వెనక్కి తిరిగాడు.

ఈ రోజున అయినా, మిల్లులో సమ్మె మూలంగా రాజు ఆ గదిలో అడుగు పెట్టడం జరిగింది. వెనక సమ్మె జరిగినప్పుడు, పోలీసు బందోబస్తుకి సంబంధించిన రహస్య వ్యవహారాలు కొన్ని రంగయ్య సొంత కాయితాలలో కనిపించవచ్చునని మిల్లు మేనేజరు చెప్పాడు. ఎంత వెతికినా ఇవతల అలాంటి కాగితాలేమీ కంటబడలేదు రాజుకి. ఆ కొట్టు గదిలో ఏమన్నా ఉన్నాయేమోనని చూడబోయాడు.

గదిలో అడుగు పెడుతూ వుంటే, రాజుకి గుండె ఉధృతంగా కొట్టుకోసాగింది. గుమ్మంలోనే, పైనించి ఏదో బూజుపడి వొళ్ళు ఝల్లుమంది. బయట పట్టపగలయినా గదిలో చీకటి, భయమేసింది. లైటు వేసినా చీకటే ననిపించింది అక్కడ. బిగుసుకుపోయిన బీరువా తలుపు దబాయించి గుంజినప్పుడు, బాంబు పేలినట్టయి, ఆ ప్రతిధ్వనికి ఒక్కసారి గుండె గుభేలుమంది. తమాయించుకొని తేరుకోడానికి పూర్తిగా మూడు వందల సెకండ్లు పట్టింది రాజుకి.

బీరువాలో - కొన్ని దేవాలయాల మీద వుండే మోస్తరు నగ్న శిల్పచిత్రాలు డజను దాకా వున్నాయి.... మిల్లు వ్యాపారాలకి సంబంధించిన కొన్ని చిఠాల లాంటివి వున్నాయి.... వాటన్నింటినీ మించి, కట్టలు కట్టలుగా వున్న డైరీ పుస్తకాలు పట్టుకుని హాలులోకి వెళ్ళిపోయాడు రాజు....

అతనికి కావలసిన పోలీసు వ్యవహారం ఒక డైరీ లోనే కనిపించింది. ఆ తర్వాత ఐదు, ఆరు నిమిషాలపాటు, అలాగ పేజీలు తిరగవేసే సరికి, కంటబడింది మహాలక్ష్మి "రభస". ఆ పేరింటి మనిషి ఒకప్పుడు తమ ఇంట్లో దాసీగా ఉండేదని, ఆ చరిత్రంతా రాజు తల్లి చెబుతూ ఉండేది.

బొత్తిగా లేనివాళ్ళేమో, పోలికాసించి మహాలక్ష్మిని యిద్దరు పిల్లల తండ్రయిన రెండోపెళ్ళి వాడికి కట్టారట. దాని మొగుడు రంగయ్య మిల్లులోనే పని చేసేవాడు. వయస్సు నలభయ్యేగాని ఏదో దగ్గుతో బాధపడుతూ వుండేవాడట. ఏదో అల్లాగయినా బ్రతుకు గడుస్తుందనుకుంటే, పెళ్ళయిన రెండేళ్ళకే, ఆ ఆస్కారంకూడా లేకుండా పోయింది మహాలక్ష్మికి. ఓనాడు పని చేస్తూండగానే తల తిరిగి మిషనుమీద పడిపోయాడట. తర్వాత ఆసుపత్రిలో చచ్చిపోయాడు. ఆ దుఃఖంలోనే ఒక కొత్త ఆశారేఖ, మహాలక్ష్మికి కూతురు పుట్టింది. ఒక పొట్టకి రెండు పొట్టల భారం నెత్తిన బడి, యిరవై ఏండ్లయినా నిండని మహాలక్ష్మి రంగయ్య గారింట్లో దాసీ పనికి కుదిరింది.

రాజు పుట్టుకలకి, మహాలక్ష్మి పురుడు పోసిందట.. తల్లికి పెద్ద జబ్బుచేసి, రెండు ప్రాణాలూ కూడా దక్కవనుకున్న పరిస్థితిలో, రాత్రింబగళ్లు కనిపెట్టుకుని పని చేసిందట.... తను చనుబాలిచ్చి రాజును బ్రతికించిందిట.. "పాపం ఆ రోజుల్లోనే,

ఆ ఒక్క నలుసూ కూడా దానికి దక్కకుండా చేశాడు దేవుడు.. క్షయట. అల్లాగ పుట్టెడు కడుపు దుఃఖం అనుభవిస్తూనే చాకిరీచేసేది. మనిషి కూడా ఎంత అందంగా వుండేదనుకున్నావు రాజూ. అటువంటిది పాపం. కట్టుకోడానికి గుడ్డ కూడా లేకుండా కష్టపడుతూ ఉండేది. నేను ఏదో నాలుగు గట్టి చీరలే ఇచ్చాననుకో.... అసలు. దాని మొగుడు పోయినప్పుడుకూడా. తాగి మిషనులో పడ్డాడని మిల్లువాళ్ళు ఏదో కేసు రుజువుచేసి. నయా పైసా కూడా ఇవ్వలేదు. అప్పుడు మీ నాన్నేగా మేనేజరు. ఆయనతో చెప్పి ఎట్లాగో రెండొందల రూపాయలు ఇప్పించాను. అప్పటినుంచి దానికి మన మంటే వెర్రి అభిమానంగా వుండేది. తర్వాత ఏదో తప్పుడుత్రోవపట్టి మన యిల్లు వదిలేసిందిగాని. ఇప్పటికైనా తలుచుకుంటే ఏమిటో జాలేస్తుంది పాపం!...."

తల్లి చెప్పిన ఆ గొడవంతా రాజుకి ఇప్పుడేదో చాలా దగ్గర విషయంలాగ పునశ్చరణయింది మనస్సులో. అంతటివాడు. తన తండ్రికి. అల్లాంటి బుద్ధే పుట్టినా ఇంట్లో పనిచేసే దాసీదాని కోసమే ఆశించడమేమిటని ఆశ్చర్యం వేసింది. అంత అందమైనదా మహాలక్ష్మి? లేకపోతే. ఇల్లాంటి రంకయితే వెల్లడవదన్న ఉద్దేశమా?

గిర్రున హాలుగంట మ్రోగింది....

ఆదుర్దాగా మిల్లు మేనేజరు ప్రత్యక్షమయాడు.

సమ్మె చాలా తీవ్రం అవుతోంది.

కొత్త కూలీలు మిల్లులోకి రాకుండా. సమ్మెదారులు పికెటింగు జోరు చేశారట.

"ఏదో చెయ్యకపోతే రేపు మిల్లు మూసెయ్యాల్సి వస్తుంది" అంటూ మేనేజరు నీళ్ళు నమిలాడు.

"పోనీ కూలీ రేటు పెంచుతామంటే."

"అసలు కీలకం అదేగదా అండి. ఇవేళ యిరవై పైసలు పెంచుతామంటే రేపు నలభై పైసలు కావాలంటారు. గట్టిగా భయపెట్టి లొంగదీయాలి గాని."

"భయమా? ఇంకా ఎలాగ భయపెట్టేది?-"

"చిత్తం. ప్రొద్దున్న మనవిచేసినట్టు ప్రత్యేకంగా పోలీసు అధికారులతో మాట్లాడాలి. బందోబస్తు ఎక్కువ చేయించాలి. అవసరమైతే తుపాకులూ-"

"అదా? సరే. క్రిందటి మాటులాగే ఏర్పాట్లు కానియ్యండి. మీరే వెళ్ళి సూపర్నెంట్‌ను కలుసుకోండి-"

"చిత్తం. చిత్తం. ఒంటి గంటలోగా అన్ని సంగతులూ తమకి మళ్ళీ టెలిఫోను చేస్తాను. సెలవు."

మేనేజరు వెళ్ళడంతోటి. కామరాజు మళ్ళీ తీవ్రాలోచనలో పడ్డాడు. ఆ డైరీల వ్యవహారం. మిల్లు సమ్మెలులాగ. బుర్రలో బాదుతూనేవుంది. కాని. మనస్సు చికాకుకి ఆ డైరీల పరిశోధన. ఒకవిధంగా కొంత ఉపశమనంగా కూడా తోచింది....

ఒకనాడు—

మహాలక్ష్మి గది తుడవడాని కొచ్చింది.

"మొన్న కళా ప్రదర్శనంలో కొన్న •అప్సరస• ప్రత్యక్షం అయినట్టనిపించింది." అని రంగయ్య ఆనాడు తన డైరీలో వ్రాసుకున్నాడు. అదిగాక. ఎవరో, "పైడీ." "సబ్బులూ" అని "వతను" వ్యవహారాలు కొన్ని కూడా కనిపించాయందులో. మహాలక్ష్మి మీద ఎక్కువమోజుకి దాని అందచందాలే కాకుండా. అది మామూలుగా ఓ పట్టాన లొంగకపోవడం కూడా ప్రబలకారణం అయిందని రాజు గ్రహించగలిగాడు. "అప్సరస"ని కొన్నట్టే. ఆ మనిషిని కొనలేక రంగయ్య బుసలు కొట్టాడు.


# శ్రీ చక్రపాణి అవార్డులు-1978

తెలుగులో ఉత్తమ నవలా, కథాసాహిత్యాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో 'యువ' పత్రికవారు 1978 సంవత్సరానికి శ్రీ చక్రపాణి అవార్డులను బహూకరిస్తారు.

నవల : మొదటి అవార్డు — రూ. 2,250
: రెండో అవార్డు — రూ. 1,116
: మూడో అవార్డు — రూ. 850

కథానిక : మొదటి అవార్డు — రూ. 1,000
: రెండో అవార్డు — రూ. 750
: మూడో అవార్డు — రూ. 500
: నాలుగో అవార్డు — రూ. 350
: అయిదో అవార్డు — రూ. 250

పై అవార్డులుకాక యువచిత్రవారి (సీతామాలక్ష్మి నిర్మాతలు) శ్రీ చక్రపాణి ప్రత్యేక అవార్డు రు. 1,116

(తరాల అంతరాల) ఇతివృత్తంతో 40-50 పేజీల మధ్య పెద్ద కథకు మాత్రమే ఈ అవార్డు. దీనికోసం కథలు పంపేవారు కవరుపైన "యువచిత్రవారి శ్రీ చక్రపాణి ప్రత్యేక అవార్డు కోసం" అని స్పష్టంగా వ్రాయాలి.

శ్రీ చక్రపాణి అవార్డుల కోసం పంపే నవల, కథానిక ఆంధ్రుల సమకాలీన సామాజిక జీవనానికి ప్రతిబింబంగా ఉండాలి. నవల అరఠావు సైజులో 80-100 పేజీల మధ్య. కథానిక 16 పేజీలకు మించకుండా ఉండాలి. కవరుపై "శ్రీ చక్రపాణి అవార్డుల కోసం" అని స్పష్టంగా వ్రాయాలి. నిబంధనలకు "యువ" ఏప్రిల్ సంచిక చూడండి. పై అవార్డుల నిమిత్తం మాకు రచనలు చేరవలసిన ఆఖరు తేదీ : 12-4-1978.

సంపాదకుడు, యువ,
పబ్లిక్ గార్డెన్ రోడ్, హైదరాబాదు-1.

**తెల్ల వెంట్రుకలు ఆపండి**

హెయిర్ డై వలన కాదు. మా ఆయుర్వేదిక్ పుష్పమాల హెయిర్ ఆయిల్ తెల్ల వెంట్రుకలను శాశ్వతంగా నలుపుగా మార్చును. మెదడుతో పనిచేయు ప్రతి ఒక్కరికి మంచిది.

ఒక సీసా ధర రు. 11/–ఒక కోర్సు 3 సీసాలు–రు. 30/– పోస్టేజి అదనం.

MODI CHIKITSALAYA (S.D.V)
P. O KATRI SARAI (GAYA)



**WHEN NATURE FAILS**

మరింత ఎత్తు,పొడుగు కాగలరు

H New Super Height 2 నుండి 8 అం. వరకు పూచీ. (For Super Heightness) మీరు పొడుగు పెరగదలచుకుంటే ప్రపంచ ప్రఖ్యాతి పొందిన మా హైటెక్స HYTEX ఔషధాన్ని వాడండి. వయోపరిమితి లేదు. స్త్రీలు పురుషులు కూడా పుచ్చుకోవచ్చు. HYTEX is a great name and meant for popu—lar people I Phail (20 T A B. S.) Rs. 7–50 advance By M. O. 3 Phails (60 Tabs) Rs. 15/– money order by advance

M/s London Commercial Coy
Beat No I, House No 3883X
Ambalacantt—133001 (N. I)
Correspond in English (A.j.w/3/78)



**తెల్ల మచ్చలు**

మా వ్యక్తిగత బూటి తెల్లమచ్చరంగు సహజంగా త్వరితగతిని మామూలుగా మార్చును. 2 నెలలకు ఒక సీసా ఉచితంగా ఇవ్వబడును.

**తెల్ల వెంట్రుకలుండవు**

పొగడటం మాకు ఇష్టంలేదు. కాని మా "కేశరంజన్" ఆయుర్వేదిక్ సెంటెడ్ ఆయిల్ తెల్ల వెంట్రుకలను నల్లగా మార్చును. మొదట తెల్ల వెంట్రుకలను నల్లవిగా మార్చి అటుపైన నల్లని వెంట్రుకలే వచ్చును. ఈ ఆయిల్ జ్ఞాపకశక్తి, కంటిచూపు వృద్ధి పరచును. లాభం పొందినవారు 1000 పైగా మాకు వ్రాసియున్నారు. లాభం లేకున్న డబ్బు వాపసు. ధర రు. 12/–.

SHYAM AYURVED BHAVAN (S.5)
P. O. Katri Sarai (Gaya)


వగబట్టాడు. అయిదుకీ, పదికీ ఆశపడే టట్టులేదు. అని ఒకనాడు గ్రహించి. "ఒక్క సారిగా వంద రూపాయలు" చూపించాడా మర్నాడు....

"అంత లేనిముండా ఆ రూపాయలు కూడా తిరస్కరించింది. నానా మాటలూ దులిపింది." - రంగయ్య అహంకారం దెబ్బతింది....

"అదంతా ఒక నటన. వంద కాకపోతే రెండు వందలు. తగిన తరుణం రావాలే గాని. డబ్బుకి లొంగకపోవడమేమిటి?" — అని అతని ప్రజ్ఞా బుద్ధి సంబాళించింది....

కొత్త ధీమాతో, ఆ తరుణానికి ఎదురు చూశాడు రంగయ్య. తనకి తెలియకుండా దానికి నయాపైసాకూడా ముట్టకూడదని గట్టి కట్టడి చేశాడు యింట్లో.

పదిరోజుల తర్వాత.

శరత్ పౌర్ణిమ.

తన గౌరవార్థం జరిగిన విందుకు హాజరై. రంగయ్య అప్పుడే ఇల్లు చేరుకున్నాడు.

"ఆ మత్తు ఇంకా వదిలిందో, లేదో. "గదిలో ఒక మూల నక్కి "మ. ల." ప్రత్యక్షం. కూతురికి ప్రాణంమీద కొచ్చిందిట. డాక్టరేవో ఇంజక్షనులు కొనుక్కురమ్మన్నాడట. ఒక్క ఇరవై రూపాయలు ఇప్పించమని కాళ్ళట్టుకుంది. "ఇరవై ఏం ఖర్మం! పది ఇరవైలు పట్టుకెళ్ళు. ఇది వరకే ఇస్తానన్నానుగా?" అనేసరికి, చప్రున లేచి, అదో చిత్రంగా చూస్తూ నుంచుంది. అంత అందం ఎప్పుడూ చూడలేదు. క్షణం ఏదో భయం వేసింది... "నీ జీవితానికే లోపం లేకుండా చూసుకుంటాన"ని నేనంటున్న మాటలన్నీ వింటూనే - నా మీదకి ఒరిగిపోయింది...."

ఆ దరిమిలా, కొన్ని నెలలవరకూ, మహాలక్ష్మి పేరు, ఆ డైరీ పేజీలలో, పైడీ సుబ్బులూ - లాంటి పేర్లతోబాటే, చూచాయగా కనబడుతూ వచ్చింది....

ఒక సారి మాత్రం —

తన గుట్టు బయటపడే ప్రమాదం చెప్పుకుని ఏడిచిందిట....

ఏదో ఉపాయం చెయ్యకపోతే, కులం వాళ్ళు తనని బ్రతకనివ్వరని మొరపెట్టుకుందిట.... సంగతంతా బయటపెట్టి. ఏ నుయ్యో. గొయ్యో చూసుకుంటానని బెదిరించిందిట.... "తన మాట ఎవరు నమ్ముతారనో.... దాని ధీమాకి నవ్వొచ్చింది" అని ఆనాటి డైరీ పేజీ వ్యాఖ్యానం....

చివరికి ఏ ఆసుపత్రిలోనో తంటాలు పడమని రంగయ్య ఇవ్వబోయిన వంద రూపాయలూ తిరస్కరించడంతోటి మహాలక్ష్మి కథ అంతం అయినట్టు కనిపించింది.

తర్వాత వరసగా కొన్ని ఏళ్ళ డైరీలు తిరిగేశాడు రాజు. మిల్లులో రంగయ్యభాగం సంపాదించడం గవర్నరు కిచ్చిన విందూ, కొత్త భవనం కట్టడం మొదలయిన వెన్నో గొడవలున్నా యందులో. నవల మధ్య కథ నడవని వర్ణనలలాగ, ఆ పేజీలు చరచరా త్రిప్పేశాడు రాజు. కాని, ఎక్కడా "మ.ల." జాడ లేదు.

గోడ గడియారం టంగున ఒంటిగంట కొట్టింది.

వెంటనే మేలుకున్నట్లు, గణగణ టెలిఫోను మ్రోగింది.-

మేనేజర్!

మిల్లు ప్రాంతం అంతా అట్టుడికి పోతోందట .... ఒకటి, రెండుచోట్ల గలభాలుకూడా జరిగాయట. అంతక్రితమే, రిజర్వ్ పోలీసు దండు వచ్చాక, పరిస్థితి కొంత నయం అయిందట.

"ఆ దొరికింది"- అన్నాడు, డైరీ పేజీలు ఇంకా తిరిగేస్తూనే ఉన్నరాజు. హఠాత్తుగా "ఏమిటండీ?-హల్లో, కామరాజుగారేనా?" అంటూ మేనేజరు కంగారు!

"ఆ, ఏంలేదు. ఇక్కడ నేను వెతుకుతున్న కాగితం ఏదోలెండి. సరే, విశేషం ఏమన్నా వుంటే మళ్ళీ టెలిఫోను చెయ్యండి!" అని రాజు ఆ సంభాషణ ముగించాడు.

అతనికి దొరికిన విషయం, డైరీ పేజీలలో —

ఒకనాడు –

కొత్త మిల్లు ప్రారంభోత్సవానికని రంగయ్య హడావుడిగా అటువెడుతున్నాడు. కూలీలపేటలో చటాలున, ఎక్కడనించో రాయి తగిలి కారు "విండ్ షీల్డ్" పగిలింది. కాస్తలో ప్రమాదం తప్పిందిగాని. ఆ కుర్రవెధవ చచ్చిపోవలసిందే. అవతల ఆడుతున్న పిల్లలు అంతా పారిపోయారు. రంగయ్య కారు దిగి, కుర్రవాడిని నిలేసి నాలుగు లెంపకాయలు కొట్టాడు.

పది, పన్నెండేండ్ల వయస్సు. పేరు రాములుట. బానపొట్టా, చింకిరి బనియనూ చింపిరి తలా, వొళ్ళంతా దుమ్మూ. చూడగానే రంగయ్యకి కోపంతోబాటు, చాలా అసహ్యం వేసిందిట.

"కారుక్రింద పడమనీ, తర్వాత మస్తుగా డబ్బు గుంజుకోవచ్చుననీ మీ బాబు ఎత్తు" అని ఝూడించేసరికి, "అల్లాంటి ఎత్తులన్నీ గొప్పోళ్ళకే తెలియాల"ని షెడీమని జవాబిచ్చాడట పొగరుబోతువెధవ!.... "మీ బాబు పేరేమిటి వెధవా?" అంటే వాడు రంగయ్యకేసి చూస్తూ గొల్లుమని ఏడిచాడుట. ఈ

లోపున, కాకులలాగ మూగిన గుంపులోంచి ఎవరో చెప్పారు.

వాడో ముష్టిదాని కొడుకుట. పదిరోజుల క్రితమే. అది బిచ్చమెత్తుకుంటూనే వీధిలో పడి చచ్చిపోయిందిట. "మహలక్ష్మి" అని. వయస్సులో వున్నప్పుడు దానికో మొగుడంటూ లేడు బాబూ" అని, ఆ మనిషి అన్న మాటకి, జనంలో కిచకిచలు బయలుదేరాయి —

రంగయ్య గుండె చురుక్కుమంది.

"అప్సరస" చిత్రం. ఆ దేహంతో అనుభవాలూ, అప్రయత్నంగా అతని మనస్సులో ఝల్లుమన్నాయి. రాముల్ని చూసి, "ఛీ. ఛీ" అనుకున్నాడు. వాడి పీక నులిమెయ్యాలన్నంత కోపం వచ్చింది. అవతల, మిల్లులో ముహూర్తానికి ఆలశ్యం అయిపోతుండడంవల్ల, ఎవరో తెచ్చిన నీళ్ళతో చేతులు కడుక్కుని, కారెక్కి వెళ్ళిపోయాడు....

"ముష్టివెధవకి ఎంత పొగరు! కారు క్రింద పడ్డా తీరిపోను" అని డైరీలో ఆ సంఘటన చివరిమాట....

కాని ఆ వివరాలన్నీ చదువుతుంటే, నిజంగా అంత అమానుషం ఉంటుందా అని సందేహం వేసింది రాజుకి.

అంతలో మళ్ళీ టెలిఫోను మ్రోగింది.

"ఫలహారానికి రావలసింద"ని అతని భార్య పిలుపు.

"ఏదో అర్జంటు పనిమీద వున్నాన"నిఅక్కడకే పంపమన్నాడు. "డైరీలు" ముందు పడేసుకుని భార్య పంపించిన పాల పూరీలూ, పళ్ళూ తిన్నాడు. ఓవల్‌టిన్ త్రాగి ఓ సిగరెట్టు ముట్టించాకగాని, రాజుకి మళ్లీ తాను వాస్తవిక ప్రపంచంలో వున్నానన్న నమ్మకం తోచలేదు.

కొన్నాళ్ళ తరువాత మళ్ళీ, డైరీ పేజీలలో, క్రొత్త వేదాంతం కొంత రెపరెప లాడింది.

"అడ్డులేని సంతోషం అంటూ ఉండదు కాబోలు జీవితంలో! మూడేళ్ళ పరిశ్రమ ఫలితం, ఆ శివయ్యగాడి దివాలా వ్యవహారం పూర్తయిందని కులాసాగా ఉన్నప్పుడే సరిగ్గా, ఆ రాములు వెధవ మళ్ళీ తటస్థపడ్డాడు. చచ్చీ కూడా ఆ ముండ ముల్లులాగ తటస్థపడ్డం తప్పదు కాబోలు. ఐనా అది నా మనోదౌర్బల్యమేనేమో. కాకపోతే, నిన్న రాత్రి గమ్మున పిస్తోలు తీసి కాల్చేస్తే వొదిలిపోదూ? "ఫస్టు క్లాసు" పెట్టెలో నేను ఒక్కడినీ ఉండడం చూసి పీక నులిమెయ్య బోయాడు. ఆత్మరక్షణకి కాల్చానంటే తీరిపోయేది. కాని, ఆ వెధవని పోలీసులకి ఒప్పగించిన తర్వాతగాని, నాకా యోచనతట్టలేదు. దొంగవెధవ ముష్టెత్తుకోడానికే పెట్టెలో పడ్డాడుట. ఎంత ధీమా. వెధవకి? "దుక్కలా వుండి ముష్టేం రోగమంటే "పని ఇప్పిస్తారా, మానేస్తాన"న్నాడు వెకిలిగా నవ్వుతూను. దొంగతనానికి కాకపోతే, నేను నిద్దరోతున్నాననుకుని పెట్టె తాళంకప్ప తడవడం ఎందుకో! "ఏదో పదం పాడుకుంటూ తాళం వేస్తున్నాన"ని గొల్లున ఏడిస్తే ఎవరు నమ్ముతాడనో! సమయానికి నేను కనిపెట్టకపోతే, నా పీక నులిమినా నులిమేవాడే నిజానికి! గట్టి శిక్ష పడేటట్టు చూడాలి వెధవకి. అసలు, అప్పుడే పిస్తోలు ఉపయోగించకపోవడం పొరపాటు! ఒక్కొక్కప్పుడు, జాలి అన్నది మనిషికో పెద్ద లోపమే."

తండ్రి వెళ్ళబోసుకున్న ఆ మనస్తత్వం కామరాజు గుండె దేవేసినట్టయింది. రంగయ్య అంతరాత్మలో ఎక్కడో 'తప్పు' అన్న భావం తాళంవేస్తూ వుండి వుండాలి. అది ఒప్పుకోడానికి అహంకారం అడ్డు-దాని తాలూకు చిహ్నం రాములు మిగిలిపోయాడే అన్న కించ. అది ప్రపంచంఅంతా గుర్తించిపోతారేమో అన్నభయం. హంతకుడు నెత్తురు మరకలు కడిగెయ్యబోయినట్టు. ఆ కాస్త మిగులూకూడా కనిపించకుండా చెయ్యాలన్న ప్రబల ప్రయత్నం.




ఇలాగ మనసులో సెలలు వేస్తున్న యోచనలతో "అబ్బా" అని నిట్టూర్చాడు రాజు. ఇంకో సిగరెట్టు ముట్టించి తతిమ్మా డైరీలకేసి చూశాడు.

ఆరు పుస్తకాలే మిగిలాయింకా-

ఆ కథ ఎల్లా ముగిసిందో అన్న ఆదుర్దాతో తిరగెయ్యడం ప్రారంభించాడురాజు.

ఐదేండ్ల తరవాత మాట —

జైలు విజిటరు హోదాలో ఖైదీల పరామర్శకి వెళ్ళాడుట రంగయ్య ఒక నాడు —

అక్కడ దూరంగా రాళ్ళు కొడుతూ కనిపించాడు నంబరు నూటడెభ్భయ్మూడు. గడ్డం మాసి వుంది. తలంతా దుమ్ముపట్టి వుంది. పేగులపైన చమట. క్రుంగుతున్న ప్రొద్దుఎరుపులో నెత్తురులా వుందిట. బాగా పరకాయించి చూస్తేగాని. రాములన్న ఆనమాలే తెలియలేదుట. రంగయ్య కూడా వున్న క్రొత్త సూపరింటెండెంటు చెప్పాడు "173" చాలా మేథకస్తుడని "మేకలాంటి ఈ మనిషి ఒకప్పుడు హత్య చెయ్యబోయాడంటే ఆశ్చర్యం వేస్తుందండి. మానవ స్వభావం మహా విచిత్రమయింది. ఏదో పాపం. యింకో నాలుగు నెలల్లో విడుదలయి పోతాడు" అని సూపరిండెండెంటు అనేసరికి రంగయ్యకు ఎందుకో భయం వేసిందిట. "పాపం ఏమిటి? డబ్బుకోసం మళ్ళీ ఎవడి ప్రాణమో తీస్తాడన్నమాట. అసలీరకం వెధవలకి యేకంగా ఉరిశిక్ష వేసెయ్యాలి" అని మాత్రమే అన్నాడుట పైకి!

"ఇంకెందుకు? రాములు చచ్చే వుంటాడు" అనుకుని చేతిలోవున్న డైరీ నేలపైన తివాసీ మీదకి పారేశాడు రాజు. ఐతే ఎవడు చేస్తాడంత అమానుషం? ఎవడేమిటి? డబ్బుకాసించి. అల్లాంటి దారుణాలు చేసేవాళ్ళు యెందరో! నాలుగు రోజుల క్రితమే తాను పత్రికలో చదివాడు. బేడెత్తు బంగారంకోసం. ఓ చంటిపాప పీక నులిమేసిన ఘోరం! అప్రయత్నంగానే రాజు చేతులు మిగిలిన ఒక్కడైరీ పుస్తకంమీద పడ్డాయి-

అందులో సగం పేజీలింకా తెల్లగానే ఉన్నాయి. నలుపైన పేజీలు ఒక్కటొక్కటే పరపర చింపెయ్యడం మొదలెట్టాడు రాజు. ఆ ఉండలతో చిత్తుకాగితాల గంప నిండిపోతోంది-

ఒక పేజీ సగం చింపి. గమ్మున ఆగాడు రాజు!

ఏదో వ్యవహారాలతో బాటు అందులో మళ్ళీ 173 ప్రస్తావన కనిపించింది.

"నెల క్రితమే విడుదలయ్యాడుట 173. అప్పటినించి మిల్లు ప్రాంతంలోనే తిరుగుతున్నాడుట. పిచ్చి నటిస్తున్నట్లు కనిపిస్తుంది. పేరడిగితే "173" అని వెర్రి నవ్వు నవ్వేస్తాడుట. పదాలు పాడుతూ. కూలీలకు ఏవో చిన్న చిన్న పనులు చేసి పెడుతూ వుంటాడుట. తెగించిన వెధవ. కక్షకొద్దీ ఏం చేసినా చెయ్యొచ్చు. తగిన చర్య ఏదో తీసుకోకపోతే ప్రమాదం". రాజు నిస్తబ్ధుడయ్యాడు. మిల్లు దగ్గర పిచ్చివాడిని తానూ చూశాడోసారి. ఆ చిరుగుల బనియనూ, జడలు కట్టిన తలా, చింతనిప్పుల్లాగ కళ్ళూ - మానవ శిథిలంలాగ ఉన్న వాడేనా 173 రాములు? తన- తన తమ్ముడు?

ఒక్కసారిగా రాజు మనస్సులో ఉప్పెన మరింత హోరెక్కువై పోయింది....

రైలుపట్టాల ఇనుంపాటలాగ. "తమ్ముడు - నా తమ్ముడు" అని గుండెలు అంతకంతకి జోరుగా దరువెయ్యడం మొదలెట్టాయి .... చెవులు గింగుర్లు పడ్డాయి.... తల తిరిగింది....

మర మనిషిలాగ డైరీ పేజీలు చింపేస్తూనే వున్నాడు రాజు. ఒక్క పేజీ - ఇంకొక్కటే పేజీ -

రంగయ్య అకస్మాత్తుగా చనిపోవడానికి ముందురోజు రాత్రి వ్రాసుకున్న - ఆఖరి పేజీ అది -

"ఈవేళ మిల్లులో ఏదో యధాలాపంగా తెలిసింది - ఆ దొంగ వెధవ కూలి పని సంపాదించాడట. పనివాళ్ళందరికీ చాలా అభిమానంట వాడంటే. మేనేజరుకీ మతిపోయినట్టుంది............ హాజరు పట్టీలో "పిచ్చయ్య" అని ఏదో పేరు వ్రాసుకుని. నంబరు మాత్రం 173 క్రిందే నమోదు చేశాడుట. అందరూ అలాగే పిలుస్తారుట వాడిని.... రేపు మేనేజరుని పిలిపించి గట్టిగా నాలుగూ పెట్టాలి."

డైరీ బల్లమీద కొట్టాడు రాజు!

అంతరాళంలో గప్పున పెట్రోలు పోసి అంటించినట్టయింది. "అబ్బా" అని పెద్ద నిట్టూర్పుతో సోఫాలోనించి లేచాడు. హాలులో అటూ ఇటూ పిచ్చిగా తచ్చాడు సాగాడు. లోపల మంటలు మరింత ఎక్కువయ్యాయి ఆ క్షణంలో -

రంగయ్య ఒక రాక్షసుడిలాగ తోచాడు.

పట్టలేని కోపమూ. కసీ పెనవేసుకున్నాయి గుండెలని....

ఉక్కిరి బిక్కిరయాడు రాజు....

ఉన్న బలం అంతటితోటీ చేతిలో వున్న డైరీ పేజీని వుండగా నొక్కేశాడు. వుండని గట్టిగా నలిపేశాడు.

'ఛీ. ఈ రంగయ్య నా తండ్రా?' అనిపించింది.

అసహ్యం వేసింది!

అంతటి అమానుషానికి గురి అయిన ఒక అభాగ్యజీవి రాములు ఆ పిశాచం పళ్ళ కత్తుల బోనులో చిక్కుకుని.

కారణమైనా ఊహించకుండా.

విరిగి. నలిగి పిప్పయిపోయాడనిపించింది.

రాజు మనస్సు ధర్మోద్రేకంతో కంపించింది.

తనకు సంక్రమించిన ఆ మిల్లూ. ఆస్తీ.- అంతా అన్యాయంగా కనిపించాయి.

కాని -

తాను కూర్చున్న సోఫా -

అంతక్రితం తిన్న ఫలహారం -

తాను కాలుస్తున్న సిగరెట్టుకూడా -

ఆ ఆస్తిలో భాగాలేనన్న యోచన తోచలేదప్పట మట్టుకు-

డబ్బాలో ఆఖరి సిగరెట్టు ముట్టించేసరికల్లా —

టెలిఫోను మ్రోగింది —

మిల్లు మేనేజరు!

పెద్ద దొమ్మీ జరిగిపోయిందిట —

పోలీసులు నాలుగు రౌండ్లు కాల్చారట—

నలుగురు కూలీలు చచ్చిపోయారట —

తొమ్మండుగురికి గాయాలు తగిలాయట—

"అందులోకూడా 173 పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉందని ఇప్పుడె ఆసుపత్రి నుంచి ఫోనొచ్చిందండి-"

"ఎవరూ? నూటడెబ్భయిమూడా?"

"అదే. మీకు తెలియదులెండి ఆనంబరు మిల్లుకూలీ—"

రాజు మనస్సులో బాంబు ప్రేలింది.

రాములింకా బ్రతికే వున్నాడు.

రాజుకి చెవులు గళ్ళడ్డాయి!

రాజుకి కళ్ళు చీకట్లు క్రమ్మాయి!

"ప్రస్తుతం మిల్లు సంగతి" ఫోనులో మేనేజరు.

"మూసెయ్యండి" అరిచాడు రాజు.

"చిత్తం అదే నేనూ అనుకున్నానండి" నసుగుతున్నాడు మేనేజరు.

రాజు మనస్సులో రైళ్ళు పరుగెత్తాయి.

బరువైన గూడ్సు రైళ్ళు!

ఆ పరుగులో ఒకటే రైలు పట్టాల ఇనుపపాట —

ఆ పాటలో ఒకటే కణతలు పగులుతున్న దరువు —

"నూటడెబ్భయిమూడు — రాములు — రాములు —

రాములు — రాములు — నూటడెబ్భయ్మూడు-"

హఠాత్తుగా రాజు మనస్సులో కుతూహలం మెరసింది - రాముల్ని చూడాలి.

ఆత్రుత విరిసింది -

వెంటనే చూడాలి!

మేనేజరు ఫోనులో నసుగుతూనే వున్నాడు.

"ఒక్క రెండు రోజులపాటు మూసేస్తే అంతా సర్దుమణిగాక తర్వాత సంగతి."

"మనం ఆసుపత్రికి వెళ్ళి చూడాలి" కేక పెట్టాడు రాజు.

"చిత్తం. ఐతే రేపు వుదయమే."

"కాదు. ఇప్పుడే వెళ్ళాలి."

"చిత్తం."

"మీరల్లా వచ్చెయ్యండి. నేను తిన్నగా బయలుదేరుతున్నాను" అంటూనే. అవతల నౌకరుకోసం. గంట నొక్కాడురాజు.

వెంటనే డ్రైవరుతో చెప్పమన్నాడు కారుకోసం.

గంటక్రితమే అమ్మగారు కారు తీసుకెళ్ళారని మనవిచేసుకున్నాడు నౌకరు.

అమ్మగారంటే - కామరాజు భార్య -

ఏడాది క్రితమే ఎనభై వేల కట్నంతో పెళ్ళి చేసుకున్న నవోఢ -

గమ్మున రాజుకి గుర్తొచ్చింది-

ఆ సాయంకాలమే ఇద్దరూ సినిమా చూద్దామనుకున్నామని - అంతకంటె ఎక్కువై కూర్చుందిప్పుడు రాముల్ని చూడాలన్న ఆకాంక్ష- చూసి ఏంచెయ్యాలి?

ఏదో చెయ్యాలన్న ధర్మోద్రేకం-

ఇప్పుడు అంతగా బాధించడంలేదు.

క్రమంగా మంచులాగా కరిగిపోయినట్టుంది. చూడాలనే కుతూహలం మాత్రమే తొందర పెట్టింది—

అవతల—

గేటు ముందు కారు హారను వినిపించింది—

ఇవతల—

హాలులో గోడ గడియారం తాపీగా ఐదు గంటలు కొట్టేసింది.

*　　*　　*

కామరాజు ఆసుపత్రి చేరేసరికే. మేనేజరు అక్కడ చేతులు నలుపుకుంటూ సిద్ధంగా ఉన్నాడు—

ఏదో కుర్రవాడనుకున్న కామరాజు అంత ధాటీగా ఆజ్ఞలు జారీ చెయ్యడం అతగాడి అనుభవంలో అదే మొదటిరోజు.

జనరల్ వార్డుముందు నర్సు "ఓ పదమూడో నంబరా"?" అని వారికి దారి చూపించింది. నర్సుతో మాట్లాడుతూనే రాజు ఆ నంబరు మంచానికి ఇవతలగా ఆగాడు.

"బాబుగారే స్వయంగా వచ్చారు-చూడు. నూట డెభ్భయ్‌మూడూ— నూట డెభ్భయ్ మూడూ" అని. మేనేజరు చలవరాతి సమాధిలాగ స్పృహలేక పడివున్న రోగిని లేపబోయాడు. అటు వెళ్ళి నర్సు అతడిని వారించబోయింది.

"ఊఁ" అని భారంగా మూలిగాడు నూట డెబ్భయ్‌మూడు.

తలచుట్టూ తెల్లటి కట్లు.

మధ్య రెండుచోట్ల మాత్రం ఎర్రటి నెత్తురు మరకలు.

క్రింద. దుబ్బుగా పెరిగిన నల్లటి గడ్డం-

మధ్య మధ్య - మబ్బుల మధ్య మసక మసక చందమామలాగ — పాలిపోయిన ముఖం—

రాజుకి భయం వేసింది!

మెల్లిగా కళ్ళు విప్పాడు నూటడెబ్భయ్ మూడు—

జ్యోతులులాగ ఉన్నాయి కళ్ళు!

రాజుకి జాలి వేసింది.

రోగి ముఖం మీదకి వంగాడు రాజు. అతని చెవిలో మెల్లగా అన్నాడు—

"రాములూ -"

గమ్మున కళ్ళు బాగా తెరిచాడు నూట డెభ్భయ్‌మూడు.

వెర్రిగా అలాగే రాజుకేసి చూశాడు.

ఆ కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

బొట బొట చెక్కుల మీదనించి జారి. గడ్డం దుబ్బులోకి మాయమయ్యాయి కన్నీటి బొట్లు.

అమాంతంగా ఒక్కసారి.

"అమ్మా" గావుకేక పెట్టాడు నూట డెభ్భయ్‌మూడు.

అరుస్తూనే—

ముఖంమీద చేతులు కప్పేసుకుని.

తల ప్రక్కకు వాల్చేశాడు.

ఆ అరుపు జనరలు వార్డంతా ప్రతిధ్వనించింది.

ఆసుపత్రి అంతా ఒక్కసారి కంపించినట్టయింది.

అక్కడి గోడ గడియారం ఆరు గంటలు కొట్టేసింది. ఇంకో అరగంటలోనే-

సినిమా ఆట ఆరంభమయింది-

సోఫా సీటు - చీకటిలో చెయ్యి. భార్య నడుముకి చుట్టేసి కామరాజు చూడడమూ అయింది - మరో గంటన్నరకి-

కాలవ వార స్మశానంలో నూటడెబ్భయ్ మూడుని తగలబెట్టడమూ అయింది -

మర్నాడు పత్రికలో—

ఆనాటి సమ్మె గొడవంతా అచ్చు వేయడమూ అయింది. ఆసుపత్రి సందర్శించి గాయపడ్డవాళ్ళ చికిత్సకు స్వయంగా ఏర్పాట్లు చేయడమే కాకుండా. అందులో ఒక కూలీ అంత్యక్రియలకు వంద రూపాయలు వెంటనే విరాళం ఇచ్చిన కామరాజు ఔదార్యాన్ని ప్రశంసించడమూ అయింది.

★


ఉగాది కార్డులు



తెలుగు సంవత్సరాదికి
తెలుగులో శుభాకాంక్షలు

1. ఉగాది ప్రెజెంటేషన్ సెట్ రు. **18**
(ఎక్స్‌పోర్టు క్వాలిటీ: 12 రకాల కార్డులు)
2. ఉగాది ఎసార్టెడ్ సెట్ రు. **10**
(12 కార్డులు)
3. శృంగారనాయికల సెట్ రు. **12.50**
(8 కార్డులు)

**ఉగాది కేలండర్‌లు**

*1978 April — 1979 March*

టేబుల్‌పైన పెట్టుకోడానికి. గోడకు తగిలించుకోడానికికూడా వసరైన కొత్తరకం కేలండర్‌లు.

1. "భక్తిరంజని" రు. **5.00**
(6 పేజీలు—6 చిత్రాలు: పేజీకి 2 నెలలు)
2. "వసంత విహారి" రు. **7.50**
(12 పేజీలు—12 చిత్రాలు: నెలకొక పేజీ)

ఏ కేలండర్ కావాలో ఉదహరిస్తూ దాని ఖరీదును మనియార్డర్‌ద్వారాగాని. పోస్టల్ ఆర్డర్‌ద్వారాగాని పంపితే. రికార్డెడ్ డెలివరీపోస్టులో పంపగలము.

రిజిస్టర్ పోస్టులో పంపగోరువారు అదనంగా రు. 1.50 పంపించితీరాలి.

**Cards Crafts Classics**

13/1, General Patters Road
Post Box No. 2421
MADRAS-600 002, INDIA
Grams: "CARDCRAFTS"
Phones: 812208 & 83792